నేడు వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ జిల్లాకు రాక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: డిసెంబర్ రెండవ తేదీన రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎమ్.వి.ఎస్ నాగిరెడ్డి పర్యటిస్తారని, పలు కార్యక్రమాలలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాలులో జరిగే వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన రివ్యూ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రధానంగా వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ, ఇరిగేషన్, విద్యుత్, రెవిన్యూ, మార్కెటింగ్ శాఖలతోపాటు వ్యవసాయ శాఖకు అనుబంధమైన ఇతర శాఖల అధికారులు, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

కూడు..గూడూ.. అన్నీ కరువే..!

- 'వెలుగు' నిండని 'షికారీ' బతుకులు
- పూసలమ్మితేనే పూట గడిచేది..
- కినాటంపల్లిలో నత్తనడకన 'అభివృద్ధి'

ప్రజాశక్తి -యాదమరి

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయ్యింది.. ఆజాదీకా అమృత మహోత్సవాలను వేడుకగా జరుపుకుంటున్నాం.. అయితే ఇప్పటికీ షికారీల బతుకుల్లో వెలుగు లేదు. ప్రభుత్వాలేమో సంక్షేమ పథకాలు 'గడప గడపకూ' చేరుతున్నాయంటారు.. ఇప్పటికీ యాదమరి మండలం కినాటంపల్లి అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న షికారీల దుస్థితి దయనీయంగా ఉంది.. కూడు.. గూడూ ఇప్పటికీ వారికి కరువే.. నిలువ నీడ లేదు. తినేందుకు తిండి లేదు. కట్టుకోడానికి సరైన బట్ట లేదు. పూసలమ్మితే గాని వీరికి జీవనం గడవదు. పేదరికం, నిరక్షరాస్యత వీరి వెన్నంటే ఉంటాయి.

కినాటంపల్లి అటవీ ప్రాంతంలో 54 కుటుంబాల షికారీలు నివాసం ఉంటున్నారు. వీరికి 1982లో అప్పటి ప్రభుత్వం కుటుంబాలకు నివాస స్థలాన్ని ఇచ్చింది. కొంతమంది ఇల్లు నిర్మించుకున్నారు. అవి ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. చాలా మంది ఇళ్లు లేకుండా గుడిసెల్లోనే పట్టలు కప్పుకుని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ జీవనం సాగిస్తున్నారు. 44 మందికి మాత్రమే రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇంకా పది మంది రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ గ్రామంలో 25 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి చదువుల కోసం ప్రభుత్వం పాఠశాలను ఏర్పాటు చేసింది. ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. ఒకరు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. పాఠశాల రేకుల షెడ్డుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భవనం మంజూరు చేసినా నత్తనడకనే పనులు జరుగుతున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు చేద్దామా వద్దా అన్నట్లుగా కాంట్రాక్టర్ చేస్తున్నారు. రెండేళ్లయినా ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. డ్రైనేజి, వీధిదీపాలు సైతం లేవు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి పలుమార్లు గ్రామస్తులు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని వారు వాపోతున్నారు. ఇళ్లు లేని వారికి జగనన్న హౌసింగ్‌లో ఇళ్ల మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కనీసం వీధిలైటుల కూడా లేవని, అటవీ ప్రాంతం కావడంతో బిక్కుబిక్కుమంటూ రాత్రుల్లు గడపాల్సిందేనని వారు వాపోతున్నారు. పాఠశాల భవన నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

వీధిలైట్లు వేయండి : ఎంజి

షికారి కాలనీలో గతారెల్లుగా వీధిలైట్లు మండడం లేదు. అధికారులు దష్టికి పలుమార్లు తెలియజేసిన పట్టించుకోలేదు. రాత్రుల్లో విష సర్పాలతో ఇబ్బందులు పడుతున్నాం. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను అడుగుతూనే ఉన్నాం.

ఇళ్లు మంజూరు చేయాలి : సుమతి

ఇల్లు లేని వారికి జగనన్న పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలి. ఇల్లు లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామంలో అందరికీ ఇల్లు మంజూరు చేసే విధంగా అధికారులు సహాయం చేయాలి.

సమస్యలు పరిష్కరిస్తాం : శివరాజ్, ఎంపీడీవో, యాదమరి

షికారి కాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం. వారికి కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటాం. కాంటాక్టర్‌తో మాట్లాడి నిర్మాణ పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

మల్బరీ దిగుబడి పెంచేలా శిక్షణ ఇవ్వండి : కలెక్టర్

మల్బరీ సాగుపై సిరికల్చర్ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో మల్బరీ సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా అవసర మైన అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ యం. హరి నారాయణన్ పట్టు పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ పట్టు పరిశ్రమ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, జిల్లాలో మల్బరీ సాగు తదితర అంశాలపై జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శోభారాణి, సహాయ సంచాలకులు హనుమంత్ నాయక్, కిషోర్ నాయక్, సీత, మోహన్ బాబు లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 21,600మంది రైతులు 37,631 ఎకరాలలో మల్బరీ సాగు చేస్తున్నారని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు రైతు లకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సచివాలయాలలోని సిరి కల్చర్ అసిస్టెంట్లు, అధికారులు కషి చేయాలన్నారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు రాష్ట్రీయ కషి విజ్ఞాన యోజన పథకంలో భాగంగా అవగాహన కల్పించాలన్నారు. న్యూ ప్లాంటేషన్, షెడ్స్ నిర్మాణం, పరి కరాల కొనుగోలుకు ప్రభుత్వం అందిస్తు న్న ప్రోత్సాహకాలను రైతులు సద్విని యోగం చేసుకొనేలా చూడాలన్నారు. జిల్లాలో మల్బరీ సాగు కుప్పం, పలమనేరు డివిజన్‌లలోని మండలాలలో ఎక్కువగా ఉందని, 2022- 23 సంవత్సరానికి 3వేల ఎకరాలలో కొత్తగా మల్బరీ సాగులోకి తీసుకొని వచ్చేందుకు ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఇందులో భాగంగా నవంబర్ 22 వరకు 1723 ఎకరాలను సాగులోకి తీసుకొచ్చామని పట్టు పరిశ్రమ శాఖ అధి కారి కలెక్టర్‌కు వివరించారు.

ఫిబ్రవరికల్లా మరో రెండువేల గ్రామాల్లో రీ సర్వే

రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో రెండువేల గ్రామాలకు సంబంధించి రీ సర్వే ప్రక్రియ ముగిసిందని, మరో రెండు వేల గ్రామాలలో ఫిబ్రవరి చివరి నాటికి నిర్వహించాల్సి ఉందని, నూతనంగా నియమించిన డిప్యూటీ తహశీల్దార్‌లకు శిక్షణ ఎంతైనా అవసరమని సిసిఎల్‌ఎ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్నారు. గురువారం మధ్యాహ్నం సిసిఎల్‌ఎ కార్యదర్శులు సిద్ధార్థజైన్, ఇంతియాజ్‌లతో కలిసి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో రెండువేల గ్రామాలకు సంబంధించి మొదటి దశలో రీసర్వే ముగిసిందని, ఇందుకు సంబంధించి రెండు లక్షల మందికి సంబంధించి పట్టాదారు హక్కులను కల్పించాల్సి ఉందన్నారు. వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, ఎన్‌డిసి పర్వీన్, డిటి శివకుమార్ పాల్గొన్నారు.

'కర్నూలు గర్జన'ను విజయవంతం చేద్దాం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భరత్, జెడ్పి ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: న్యాయరాజధాని కర్నూలు లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 5వ తేది జేఏసి, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతృత్వంలో తలపెట్టిన కర్నూలు గర్జనను విజయవంతం చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు భరత్, జెడ్పి ఛైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని జెడ్పి ఛైర్మెన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకే ప్రాతంలో రాజధాని ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతోందనే ఉద్దేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహ్మన్‌రెడ్డి మూడు రాజధానులకు శ్రీకారం చుట్టిన్నట్లు తెలిపారు. ఈ మేరకు అమరావతి, విశాఖపట్నం, కర్నూలు మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేసేలా మూడు రాజధానులను ప్రకటించినట్లు చెప్పారు. కేవలం అమరావతి రాజధాని జపం చేస్తున్న టిడిపి నేతలు స్వలాభం కోసం మాత్రమే ఉద్యమాలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ గర్జన విజయవంతం చేసిన విధంగా కర్నూలు గర్జనను జేఏసి నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సత్యసాయి జిల్లా వైకాపా నాయకులు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలపై ప్రజాభిప్రాయం సేకరించండి

జెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి

ఇంటర్ షిప్ విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించాలని జెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అర్హులకు అందుతున్నాయా లేదా అనే విషయాలను పరిశీలించాలని కోరారు. గురువారం సైన్సు అండ్ అర్ట్స్ డిగ్రీ కళాశాల ఇంటర్ షిప్ విద్యార్థులతో జెడ్పి కార్యాలయంలో సిఇఒ ప్రభాకర్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చిత్తూరు జిల్లాలో ఎంతో సమర్ధవంతంగా జిల్లా కలెక్టర్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ షిప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో 5వేల మంది విద్యార్థులను ఎంపిక చేసి వివిధ శాఖల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పారదర్శంగా కానిస్టేబుళ్ల నియామకం : ఎస్‌పి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తగా 6,511 పోలీస్ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, నియామకాలు పారదర్శంగా చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్స్‌కు డిసెంబర్ 28 వరకు ఎస్‌ఐ పోస్టులకు జనవరి 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో ప్రాథమిక అర్హత పరీక్షల అనంతరం ఉత్తీర్ణత సాధించిన వారికి రాతపరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అభ్యర్థుల అవగాహన కోసం ఈనెల 9వ తేది స్థానిక ఆర్‌ఆర్ గార్డన్స్ నందు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 8వ తేది సాయంత్రం లోపు పోలీస్ పిఆర్‌ఓ వాట్సాప్ నెంబర్ 9440900006కు వివరాలు తెలిపాలని కోరారు.

9న టిడ్కో ఇళ్లు కేటాయించాలని నిరసన

చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (ఏపి టిడ్కో) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గృహాలు నత్తనడకన సాగడం విచారకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు, సహాయ కార్యదర్శి టీ.జనార్దన్ పేర్కొన్నారు. గురువారం చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని పేదల కోసం నిర్మిస్తున్న గృహ సముదాయాన్ని సిపిఐ ప్రతినిధి బందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి నిర్ణయం వరకు ఈనెల 9న కార్పొరేషన్ కార్యాలయం వద్ద టిడ్కో లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 10 లక్షలు ఇండ్లు నిర్మిస్తామని నమ్మబలికి నేటి వరకు పట్టణాల్లో ఒక ఇల్లు కూడా పేదలకు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు.

హెచ్‌ఐవి బారిన పడొద్దు : మేయర్

విద్యార్థులకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు నగర పాలక సంస్థ మేయర్ ఆముదా పేర్కొన్నారు. గురువారం ఉదయం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన ఆసుపత్రి నందు డిప్యూటీ మేయర్లు రాజేష్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, అడిషనల్ డి యం అండ్ హెచ్ ఓ, జిల్లా క్షయ నివారణ అధికారి రవి రాజు లతో కలిసి ఎయిడ్స్ నిర్మూలన పై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా ఆసుపత్రి నుండి చర్చి వీధి గుండా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ఎయిడ్స్ నిర్మూలనపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలను పాటించినట్లయితే ఎయిడ్స్ సోకదని, ఎయిడ్స్ సోకిన వ్యక్తుల పట్ల వివక్షత చూపరాదని తెలిపారు. ఎయిడ్స్ సోకిన వ్యక్తులు భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్లు సూచించిన నిబంధనలు పాటిస్తూ మందులను సక్రమంగా వాడితే నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఓ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. 2030 నాటికి ఎయిడ్స్ లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండాలన్నదే ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరంలో 15 వేలమందికి ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించగా 200 మందికి ఎయిడ్స్ ఉందని తేలిందన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల నుండి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా ఆసుపత్రి నందు ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నిర్మూలన పై గ్రామస్థాయి అవగాహన కల్పించి స్వచ్ఛంద సంస్థలకు, ఎన్.జి.ఓలకు సర్టిఫికేట్స్, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టరు అరుణ కుమార్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ గీత, డాక్టర్ రెడ్డెప్ప, ఎస్ వి మెడికల్ కళాశాల, అపోలో మెడికల్ కళాశాల నర్సింగ్ విద్యార్థులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యమే మహాభాగ్యం: జడ్జి కరుణకుమార్

విద్యార్థి దశ నుండి చదువు తో పాటు బాలల హక్కులు, చట్టాలు, ఎయిడ్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ కుమార్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, ఎంఇఒ సెల్వరాజ్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ జస్వంత్‌లతో కలసి లిటిల్ ఫ్లవర్ స్కూల్ నందు నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఆరోగ్యంగా ఉన్నపుడే మెదడు బాగా పనిచేస్తుందన్నారు. విద్యార్థులు మంచిని గ్రహించి, చెడును విడిచిపెట్టాలని, అప్పుడే విద్యార్థులు అనుకున్న స్థాయికి చేరుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీవాణి పాల్గొన్నారు.

సమర్ధవంతంగా సంక్షేమ పథకాల అమలు : కమిషనర్

వైఎస్ఆర్ పెన్షన్స్ అందజేస్తున్న నగర కమిషన్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్ : క్షేత్రస్థాయిలో వార్డు వాలంటీర్లు, వార్డు కార్యదర్శులు సమన్వయంతో సమర్థవంతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని నగర కమిషనర్ డాక్టర్ జె అరుణ చెప్పారు. గురువారం ఉదయం కమిషనర్ డా. జె అరుణ నగరపాలక సంస్థ పరిధిలో 41వ వార్డు తోటపాళ్యం పరిధిలో నీవానది వీధి, బాణాల వీధిలో పర్యటించారు. డిసెంబర్ 1వ తేదీ కావడంతో స్థానికంగా జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పెన్షన్ నగదు ను అందించడంతో పాటు వారితో మాట్లాడారు. ప్రతి నెల 1వ తేదీనే పెన్షన్లు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఉదయం ఏడు గంటలకే స్థానికంగా 70 శాతం పింఛన్ల పంపిణీ చేయ డంపై సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్.డి.జీ(సుస్థిరాభివద్ధి లక్ష్యాలు) సర్వేపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లలు, 14 ఏళ్లలోపు పిల్లలు, డ్రాపౌట్స్, మహిళలు, గర్భవతులు తదితర అంశాలపై క్లస్టర్ స్థాయిలో వాలంటీర్లు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇంటి వద్దకే రేషన్ పంపిణీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల కుప్పం నియోజకవర్గంలో పర్యటించినప్పుడు కుప్పం నియోజకవర్గానికి ప్రకటించిన రూ.100 కోట్లకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని చిత్తూరు ఎమ్మెల్సీ కేజే భరత్ అన్నారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ జిల్లా కలెక్టర్ ఎం.హరినారయణన్‌ను కలెక్టరేట్లోని ఛాంబర్లో కలిసి చర్చించడం జరిగిందని తెలిపారు. వీటితోపాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విజ్ఞాపన పత్రాలకు సంబంధించి పనులను సచివాలయ స్థాయి పరిధిలో వెంటనే మంజూరు చేయాలని తద్వారా పనులు చేయడానికి వీలవుతుందని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

అబ్బురపరచిన గణిత అవధానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ శివ ప్రసాద్ 31వ గణిత అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శైలజ కుమారి మాట్లాడుతూ గణితం పై భయాన్ని పోగొట్టి పిల్లల్లో ఆశక్తిని పెంపొందించేందుకు గణిత అవధానం తోడ్పడుతుందని తెలిపారు. సీనియర్ గణిత అధ్యాపకులు సాయి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలుగుతో పాటు గణిత అవధానం ప్రక్రియ చాలా ప్రాముఖ్యత పొందినదని అలాంటి కళతో చిత్తూరులో అవధానాలు చేస్తున్న అవధాని అరుణ శివ ప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పందనా పౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్యామల, పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ, గణిత ఉపాధ్యాయులు కిరణ్ కుమారి, జోత్స్న, రేవతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్‌కు ఆధార్ అనుసంధానం

ప్రక్రియ 74.60 శాతం పూర్తి :కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ తెలిపారు. గురువారం న్యూఢిల్లీ నుండి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో కలసి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ - 2023పై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా సచివాలయం లోని ఎన్‌ఐసి నుండి జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్, డిఆర్‌ఓ ఎన్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ - 2023 ముఖ్యమైన అంశమని,17-18, 18-19 వయస్సు గల కొత్త ఓటరు నమోదు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.. ఓటు హక్కు కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరు గానమోదు చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు పుంగనూరు, జి.డి నెల్లూరు, చిత్తూరు, ఈఆర్‌ఓ లు ప్రభాకర్ రెడ్డి, భవాని, రేణుక, పర్వీన్, ఎలక్షన్ సెక్షన్ డిటి పార్థ సారథి, ఎలక్షన్ విభాగం సిబ్బంది, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

పిల్లలు అంగన్‌వాడి లేదా పాటశాలలలో వుండేటట్లు చూడాలి

పిల్లలలో బరువు తక్కువ, బలహీనత ఉన్న పిలల్లకు సరైన ఆహారం అందించినట్లయితే, తల్లులు గర్భంతో ఉన్నప్పుడు మంచిఆహారం తీసుకొంటే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు సహాయపడుతుందని జిల్లా కలెక్టర్ ఎం.హరినారయణన్ అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ సిడిపిఓలు, పీడీతో సమావేశం నిర్వహించారు. బలహీనత ఉన్న పిల్లలు,రక్త హీనత వున్న తల్లుల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు.గర్భం దాల్చిన నాటి నుంచి వారి ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, పూతలపట్టు :

ఈ నెల 19, 20వ తేదీల్లో జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు సురేంద్ర కోరారు. గురువారం పూతలపట్టు మండలం బి.కొత్తకోటలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘటిత కార్మికుల సమస్యలతో పాటు స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారంపై జిల్లా మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, శివ, నగేష్ , రాధా, హేమ బాబు, ప్రభుదేవా పాల్గొన్నారు.

బోధనేతర పనులు తప్పించడాన్ని ఆహ్వానిస్తున్నాం : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

ఉపాధ్యాయులను బోధనకు దగ్గర చేర్చే క్రమంలో బోధనేతర పనులు నుండి తప్పించి కేవలం బోధనకే పరిమితం చేయడం సంతోషించదగిన పరిణామం అని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో 5 లేదా 10 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికల విధులు, జణగనణ కన్నా...బోధనకు ప్రధాన అడ్డంకి గా ఉన్న వివిధ రకాల యాప్ ల నిర్వహణ , నాడు నేడు పనులు పర్యవేక్షణ, టాయిలెట్ ఫోటోలను అప్లోడ్ చేయడం, మధ్యాహ్న భోజన పథకానికి సంబందించి ప్రతి రోజు 7 ఫోటోలను అప్లోడ్ చేయడం, జేవికే కిట్లను ఒకేసారి ఇవ్వకుండా విడతలవారీగా ఇవ్వడం, దానిని ఉపాధ్యాయులే ఎంఆర్‌సిల నుండి తీసుకురావడం వంటి పనులనుండి మినహాయించి బోధనలకు మాత్రమే పరిమితం చేస్తే ఇంకా బాగుంటుందన్నారు. ఉపాధ్యాయుల సమయాన్ని బోధనకే పరిమితం చెయ్యాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చెయ్యాలని, ఇటీవల నిర్వహించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చెయ్యాలని, బదిలీలు చేపట్టాలన్నారు.

ఆగని బైపాస్ పోరు

అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి -వి.కోట : మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు పట్టణానికి తూర్పు వైపునే వేయాలని అఖిల పక్షం నేతల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ గత 33 రోజులుగా ఈ అంశం పై నిరసన తెలుపుతున్నా సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామపంచాయతీ నుండి ముఖ్యమంత్రి వరకు వినతులు ఇచ్చినా నామాత్రపు స్పందన లేకపోవడం బాధాకరమని జెఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వి.కోటకు మంజూరైన బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి కర్నాటక మీదుగా తరలించడం దారుణమని ఆక్షేపణ తెలిపారు. ఆంధ్ర సొమ్ముతో కర్ణాటకకు రోడ్డు వేయడం ఏమిటని పిసిసి మెంబర్ ఇనయ్ తుల్లాఖాన్ అన్నారు. గరువారం జేఏసీ నేతలకు విద్యార్థులు తోడై పలమనేరు - కుప్పం జాతీయ రహదారి పై ధర్నా.. రాస్తారోకో చేపట్టారు. బైపాస్ రోడ్డు మా హక్కు.. కర్నాటక మీదుగా బైపాస్ వద్దు.. ఆంధ్ర మీదుగనే ముద్దు.. అన్న నినాదాలతో హోరెత్తింది. సుమారు గంట పాటు రోడ్డు పై అందరూ బైటాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. సీఐ ప్రసాద్ బాబు నాయకులకు నచ్చజెప్పి సంభందిత హైవే అధికారలతో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ధర్నా విరమింప జేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం చీకటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇస్తూ పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను గడపగడపకు అందించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, జడ్పీటీసీ కష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మి, గోపి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సింగిల్‌విండో ఛైర్మన్ కష్ణమూర్తి, వైసీపీ నాయకులు మంజునాథ్, శంకర్, వెంకటేశు, సుబ్బు, ఈశ్వర్, సంపత్, వెంకటాచలం, చరణ్, సర్పంచులు దేవప్ప నాయుడు, గోవిందప్ప, మండల అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు గోవులను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పుంగనూరు గోవులు ప్రపంచంలోనే పేరుపొందినవని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

గురువారం కమ్మినాయని పల్లి గ్రామంలో రైతు భాను ప్రతాపరెడ్డి పెంచుతున్న పుంగనూరు ఆవులను సందర్శించి పుంగనూరు ఆవుల లక్షణాలు, విశిష్టత గురించి తెలుసుకోవడంతో పాటు అంతరించిపోతున్న పుంగనూరు జాతి ఆవులను రైతులు సంరక్షించాలని సూచించారు. మేలు జాతి పుంగనూరు ఆవు సంరక్షించాలని ఉద్దేశంతో రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వచ్చానని ఆమె తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

ప్రజాశక్తి-కార్వేటినగరం: పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో మోహన మురళీ అన్నారు.

గురువారం బీడీ వర్కర్స్ కాలనీ, బీసీ కాలనీలలో స్వచ్ఛతసేవ్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యాన్ని మెరుగు చేసి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలని పిలుపునిచ్చారు. ఇంటి ఆవరణాల్లో చెత్తకుప్పలు, పేడదిబ్బలు లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశాలను పాటించకుంటే జరిమానాలు విధిస్తామని అన్నారు. ఇందులో భాగంగా బీసీ కాలనీలో రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి పారిశుధ్యాన్ని మెరుగుపరిచారు. సర్పంచ్ ధనంజయవర్మ, ఈవో మణి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానంతోనే ప్రపంచ అభివృద్ధి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రపంచ దేశాలు సైన్స్ పరిజ్ఞానంతోనే అభివృద్ధి చెందుతున్నాయని రాజు పల్లి మాజీ ఎంపీటీసీ తమ్మిరెడ్డి అన్నారు. గురువారం రాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు కాలుష్య నివారణకు పాటించాల్సిన పద్ధతులు, పెరటి మొక్కల పెంపకం వాటి వల్ల ఉపయోగాలు వంటి నమూనాల తయారుచేసి ప్రదర్శించారు. సైన్స్ మేళాలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులను స్థానిక నాయకులు, శంకర్ రెడ్డి, క్రిష్టప్ప, ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ప్రధానం

ప్రజాశక్తి-సోమల: పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించి నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సోమల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివ రత్నమ్మ కోరారు. గురువారం పాఠశాల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఉత్తీర్ణత పొందేందుకు నిరంతరం వారిపై శ్రద్ధ చూపాలని.. ఇంటి వద్ద చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. తమ పిల్లలు పాఠశాలకు రోజూ హాజరవుతున్నారా.. లేదా గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం తల్లిదండ్రుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని.. వాటిని పరిష్కరించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గోడ పత్రికలను గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆవిష్కరించారు. ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే ఏపీ పబ్లిక్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వజన మహాసభకు సంబంధించిన గోడ పత్రికలను ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేపట్టారు. సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డీఎంవో శ్రీనివాసులు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో రొంపిచెర్ల పరుగులు

ప్రజాశక్తి-రొంపిచర్ల: అభివద్ధిలో రొంపిచెర్ల మండలం పరుగులు తీస్తోందని.. రొంపిచర్ల మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి అన్నారు.

చిచ్చిలివారిపల్లి పంచాయతీలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి ట్యాంకుల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు, పాఠశాలల నిర్మాణాల అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నడూ జరగని అభివద్ధి ఈ మూడేళ్లలో జరిగిందని.. మిగిలిన రెండు సంవత్సరాలలో జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. జడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ శేఖర్‌బాబు, నూలు రెడ్డప్ప, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దారు మురాషా వలి, ఇబ్రహీం ఖాన్, నాగిరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..!

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా 'ఉద్భవిస్తున్న వైరల్ ఇన్ఫెక్షన్లు.. సవాళ్లు- అవకాశాలు' అనే అంశంపై ఒక్క రోజు జాతీయ కార్యశాల (వర్క్‌షాపు)ను నిర్వహించారు. గురువారం వర్సిటీ ఎమెనో సెమినార్ హాలులో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ, విశిష్ట అతిథిగా రెక్టార్ ఆచార్య టి.అనురాధ, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరి లోకనాథం పాల్గొనగా.. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల కమ్యునిటీ మెడిసిన్ ప్రొఫెసర్ బి.ఎ.ప్రవీణ్ కుమార్ సదస్సు కీలకోపన్యాసం చేశారు.

కార్వేటినగరం: ఎయిడ్స్‌పై యువత అప్రమత్తంగా ఉంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రహ్మణ్యంరాజు అన్నారు. గురువారం ఎయిడ్స్ డేను పురస్కరించుకొని గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో కలసి ర్యాలీ చేశారు. డైట్‌లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చెంగల్రాజు, గాజుల నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాలసముద్రం: ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోహన్‌కష్ణ తెలిపారు. గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు.

చిత్తూరు: చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని గాబ్రిల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. రీమ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని.. అంటించుకునే వ్యాధి అని..ఎయిడ్స్ రోగులపై వివక్షత చూపరాదని.. ఎయిడ్స్ రోగులను సమానంగా చూద్దామని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

నగరిలో..

యాదమరి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన యాదమరిలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎయిడ్స్ గురించి అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. యాదమరి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు.

పులిచెర్ల: కల్లూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, ఎల్లంకివారిపల్లి నందవనం కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

సోమల: సోమల, సదుం మండలాలలోని వైద్య సిబ్బంది, సోమల జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు.

ఎస్ఆర్‌పురం: జాగ్రత్తలు పాటించి ఎయిడ్స్‌ను నివారించాలని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా గురువారం మండలంలో చిత్తూరు-పుత్తూరు రోడ్డుపై ఎస్ఆర్ పురం పీహెచ్ డాక్టర్ పల్లవి, ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్

ఎస్ఆర్‌పురంలో..

బైరెడ్డిపల్లెలో..

బాలసుబ్రహ్మణ్యంరెడ్డి సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం ఆరోగ్య వైద్య సిబ్బంది, విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్, హెల్త్ అసిస్టెంట్ బాలు, సిబ్బంది పుష్ప, లావణ్య, కావ్య, శ్రావణి ,సంధ్య, పాఠశాల ఉపాధ్యాయులు చిన్నయ్య , మంజుల, మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ రాజా ఆధ్వర్యంలో రొంపిచర్లలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

బంగారుపాళ్యం: హెచ్ఐవీకి మందు లేదని.. నివారణే మార్గమని తుమ్మకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్, చంగల్‌రాయల్ తెలిపారు. మండల కేంద్రంలో కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

శాంతిపురం: మటం గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది సచివాలయం వద్ద డాక్టర్లు సతీష్, వంశీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నగరి: ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాలు సంయుక్తంగా ఎయిడ్స్‌పై నగరిలో అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్, కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షర్మిల, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ అరుణకుమారి, మురళీ మోహన్‌రెడ్డి, డాక్టర్ విజయబాబు, డాక్టర్ నరసయ్య, పొన్నంబలం, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి, తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ విజయచంద్ర, డాక్టర్ పద్మావతి ఎయిడ్స్‌పై ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో మోహన మురళీ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి సచివాలయ పరిధిలో నిర్మాణం చేపడుతున్న రైతుభరోసా, సచివాలయ భవనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ అధికారులు అన్న నినాదంతో ప్రభుత్వం చేపడుతున్న భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నూతన భవనాల నుంచి సేవలు అందించేలా చూడాలని గుత్తేదారులను ఆదేశించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే హౌసింగ్ నిర్మాణాలపై ప్రత్యేక దష్టి సారించి ఈ నెల ఆఖరి కల్లా పూర్తి చేసి సామూహిక గహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి కుషులు, సిబ్బంది పలువురు ఉన్నారు.

ఇంటి స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-యాదమరి: ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరుతూ బుడితి రెడ్డిపల్లి గ్రామంలోని ముస్లింలు గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు వినతిపత్రం అందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ముస్లింవాడలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో ప్రతి గడపనూ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చాలావరకు రాళ్లు కొట్టుకొని జీవనాధారం చేసుకుంటున్నామని.. కొంతమందికి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని.. మరికొంత మందికి స్థలాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యేతోపాటు జిల్లా వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి గ్రామంలో ఇంటి స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జాతీయ రహదారికి భూములు కోల్పోయామని.. తమకు నష్టపరిహారం మంజూరు కావడం లేదని గ్రామానికి చెందిన చిట్టిబాబు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దారు చిట్టిబాబు, మండల అభివద్ధి అధికారి శివరాజ్, ఎస్సై సుమన్, ఎంఈవో రుక్మిణి, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీవో కవిత, నాయకులు ధనంజయరెడ్డి, సురేష్ , హరినారాయణరెడ్డి, రవీంద్ర, కోనాపల్లి, మనోహర్, మనోహర్ రెడ్డి, మీనా, మనోజ్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: దేశ అభివద్ధికి విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విలువలను నేర్పించాలని.. విద్యార్థులు సైతం క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని రచయిత ఉపాధ్యాయులు మొర్రిమేకల దేవరాజులు అన్నారు. గురువారం రాయలపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో ఆయన సంపాదకత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులచే రచించిన ఉషఃకిరణాలు అనే బాల కవితలు, గేయాల పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఇటీవలే ఈ పుస్తకం తిరుపతిలో ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన సంపాదకులు దేవరాజులు మాట్లాడుతూ సంకల్పంతో నైతిక విలువల దర్పణంగా ఈ పుస్తకం రూపొందిందని, నైతిక విలువలతోనే విద్యార్థుల సర్వతో ముఖాభివద్ధి జరుగుతుందని, నేడు సమాజంలో నైతిక విలువలు పతనం కాకుండా దేశ భవిష్యత్తు నాలుగు గోడల మధ్యనే నిర్దేశితమవుతుందన్న మేధావుల కల సహకారం కావాలన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ పుస్తకానికి ముందు మాట రాస్తూ దేశభక్తి, పెద్దలపై మర్యాద, కుటుంబ విలువలు, క్రమశిక్షణ, సంస్కారం, మానవీయ విలువలు పెంపొందించే అనేక గేయాలు, కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయని ఉపాధ్యాయుల నుంచి బాల సాహిత్యాన్ని కూర్చి ఉషఃకిరణాలను అందించారని వెంకయ్య నాయుడు అన్నట్లు తెలిపారు. ఈ పుస్తకాలను దాతల సాయంతో చిత్తూరు, తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్ బీమాతో తక్షణ సాయం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని బంధార్లపల్లి పంచాయతీ బోయనపల్లి గ్రామానికి చెందిన మునియప్ప(37) బుధవారం రాత్రి మతి చెందాడు. సర్పంచ్ రాజగోపాల్ వైఎస్ఆర్ బీమా సిబ్బంది తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో వైసీపీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ శ్రీనాథ్ రెడ్డి, బీమా సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల శ్రీలక్ష్మీనారాయణ స్వామికి కల్యాణోత్సవం పూజలను అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజలకు గంగాధరనెల్లూరు గ్రామానికి చెందిన అర్చన, ధర్మేంద్ర నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, సుందర స్వామి, గోవింద్ స్వామి, దివేది తదితరులు పాల్గొన్నారు

ఎస్వీయూ అథ్లెటిక్ మీట్‌లో ఆర్‌సీ రెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్ లో గురువారం నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో తిరుపతి నగర పరిధిలోని డాక్టర్ ఆర్ సి రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థి సాయికుమార్ మొదటి స్థానంలో నిలిచారు. సాయికుమార్ డాక్టర్ ఆర్ సి రెడ్డి కళాశాలలో బీకాం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని డాక్టర్ ఆర్ సి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ స్థాయిలోని సైనిక్ స్కూల్‌లో 2023-2024 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం వచ్చే ఏడాది జనవరి 8న ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఈనెల 5వ తేదీవరకు దరఖాస్తులను సమర్పించవచ్చుని.. విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో సమాచారం పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు విశ్వం విద్యా సంస్థల అధినేత డా. యన్.విశ్వ నాథ్ రెడ్డి తెలియచేశారు. మరిన్ని వివరాలకు 8688888802 , 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు మండల మీట్

ప్రజాశక్తి -యాదమరి: నేడు మండల మీట్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శివరాజ్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా జెడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఆ శాఖల సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-పులిచెర్ల : మండలంలోని ఎల్లంకి వారిపల్లి బస్టాండువీధికి చెందిన గజపతి నాయుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం నెలనెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందజేస్తున్న పింఛనులో భాగంగా ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న గజపతి నాయు డుకు గురువారం ఎల్లంకివారిపల్లి వాలంటీర్ రేఖ ఆసుపత్రికెళ్ళి పింఛను అందజేశారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని చిన్న సోమల ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గురువారం ఐరన్ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. విద్యార్థులకు ఐరన్ లోపం రాకుండా ఉండేందుకు మాత్రాలను పంపిణీ చేస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

ఎంఈఓ కేశవ పిళ్ళై

ప్రజాశక్తి- సోమల: మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా వంటమ్మలు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని వండి పిల్లలకు వడ్డించాలని ఎంఈఓ కేశవ పిళ్ళై కోరారు. గురువారం చెన్నయ్య గారి పల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, సిబ్బందికి పలు సూచనలను అందజేశారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం

జాతీయ కార్యదర్శిగా గోవిందస్వామి

ప్రజాశక్తి-నగరి: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శిగా గోవిందస్వామి ఎంపికయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సమస్యలపై నగరి ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ సమస్యలున్నా బాధితుల పక్షాన నిలబడి పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమం చేస్తామని గోవిందస్వామి తెలిపారు.

తపాలా కార్యాలయాన్ని మార్చారని ధర్నా

ప్రజాశక్తి -పాలసముద్రం: నరసింహపురం పంచాయతీలో ఉన్న తపాలా కార్యాలయాన్ని మార్చారని..ఉన్న చోటనే తపాలా కార్యాలయం ఉండాలని డిమాండు చేస్తూ అదే పంచాయతీకి చెందిన టీవీఎన్ఆర్ పురం, పోతురాజుగుంట, బలిజూరు, నరసింహపురంలోని పలువురు గ్రామస్థులు గురువారం సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉన్నతాధికారు లు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి-గూడూరు రోడ్డు మార్గంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో గురువారం మోటార్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

క్రైం న్యూస్

పకడ్బందీగా రేషన్ రికార్డులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎండీయూలతో ఎవరూ లాలూచీ పడకూడదని జిల్లా రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద మండల రేషన్ డీలర్ల సమావేశాన్ని మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ డీలర్లపై విజిలెన్స్ దాడులు ఎక్కువయ్యాయని.. డీలర్లు ఎండీయూ ఆపరేటర్లతో లాలూచీ పడకూడదని.. ఏరోజు స్టాకు ఆరోజే ఇస్తూ తిరిగి సాయంత్రానికి నిల్వ, నగదును తిరిగి తీసుకోవాలన్నారు. రేషన్ దుకాణంలోని లోటును సరి చేసుకోవాలని, ఇకపై షాపులలో వీఆర్‌వో, వీఆర్ఏల అతంటికేషన్‌తో బియ్యం పంపిణీ ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు. కేవలం ఎండీయూ ఆపరేటర్లు మాత్రమే బియ్యం సరఫరా చేయాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి నరేష్ రెడ్డి, కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు మనోహర్, శంకర్, కష్ణయ్య, రఘు, మురళీ, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సూరిరెడ్డి జన్మదిన వేడుకల్లో డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: వైసీపీ చిత్తూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, యువ నాయకుడు సూరిరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం కొత్తపల్లిమిట్టలో పండుగ వాతావరణం నెలకొంది.

కొత్తపల్లిమిట్ట యూత్ ఆధ్వర్యంలో ప్రధాన వాణిజ్య కూడలిలో వైఎస్ఆర్ విగ్రహం ఎదుట అన్నదానం చేపట్టారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి గజమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గురువారెడ్డి, నాయకులు సూరిరెడ్డిని గజమాలతో సత్కరించారు.

ఏలుమలై మృతికి కారకుడిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని 89 పెద్దూరు గ్రామానికి చెందిన ఏలుమలై గత నెల 26న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏలుమలై హత్యకు పాల్పడిన ఎస్ గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. మతుడు తెలుగుదేశం పార్టీ వార్డు మెంబర్ కావడంతో అధికార పార్టీ అండతో పోలీసులు కేసును పక్కదారి పట్టిస్తున్నారని.. అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మతుని భార్య పవిత్ర పసిబిడ్డతో ధర్నాలో పాల్గొని తన భర్త హత్యకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే ఇక్కడే తాము మరణిస్తామని కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో బాస్ నేతలు బాధితులకు తాము ముందుండి తమ కుటుంబానికి న్యాయం చేస్తామని తెలపడంతో ధర్నా విరమించారు.

పంచాయతీలకు ఆర్థిక వనరులుగా బృందావనాలు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: పంచాయతీలకు ఆర్థిక వనరులుగా బందావనాలు ఎంతగానో దోహదపడుతాయని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం, పాత వెంకటాపురం, పాతపాళ్యం పంచాయతీల్లో గురువారం ఎంపీడీవో పర్యటించి సచివాలయాలు, బందావనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్లు చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బందావనాలకు తరలించడంతో ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా, వారి ఆర్థిక పరిస్థితి పెంపొందుతుందని పేర్కొన్నారు. అనంతరం సచివాలయాల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివయ్య, పంచాయతీ కార్యదర్శులు కుమార్, మురళీ పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి సిఎం సహకారం

తిరుపతి టౌన్ : నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. నగరంలో 5, 32, 50 డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులకు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలితో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, తిరుత్తణి శైలజ, శ్రీదేవి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు

ఎయిడ్స్ నివారణపై ర్యాలీ

తిరుపతి టౌన్ : తిరుపతి లైన్స్‌క్లబ్ అధ్యక్షులు భిమినేని మునికృష్ణనాయుడు ఆధ్వర్యంలో భవానీనగర్‌లోని గేట్ కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటే చక్కని జీవనాన్ని సాగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గేట్ కాలేజి ఛైర్మన్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, క్లబ్ కార్యదర్శి చిత్రామోహన్, ట్రెజరర్ ముబారక్ బాష పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ' ఇంటింటా ప్రచారం

తిరుపతి టౌన్ : మూడున్నర సంవత్సరాల జగన్ పాలనపై 'ఇదేం ఖర్మ' అంటూ మున్సిపల్ కార్పొరేషన్ 50వ డివిజన్లో తిరుపతి మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ ఆద్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. సమస్యలపై నిలదీసేలా ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, సీనియర్ నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, పుష్పలత, ఆర్‌సి మునిక్రిష్ణ పాల్గొన్నారు.

జెపి సనక్ రాజ్ వర్థంతి పురస్కరించుకుని అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జిత్తు జువెలర్స్ వ్యవస్థాపకులు జెపి సనక్ రాజ్ 14వ వర్థంతి సందర్భంగా గురువారం అన్నదానం

నిర్వహించారు. స్థానిక రుయా హాస్పిటల్ వద్ద జరిగిన కార్యక్రమంలో జిత్తు జువెలర్స్ అధినేత జిత్తు మాట్లాడుతూ మా తండ్రి జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా గురువారం రుయా హాస్పిటల్ వద్ద రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని పంపిణీ చేశామన్నారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేపట్టామని తెలిపారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు, అలిపిరి, కపిల్ తీర్థం కేటీ రోడ్, ఇస్కాన్ మార్గం, ఎస్ వి మెడికల్ కాలేజీ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో రోడ్డుపై నిద్రిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్. ప్రవీణ్. రాకేష్. రాజేంద్ర. యునీక్, యువరాజు. లీలా. కాంత. రాఖీ .సుష్మ. రాజిన్. పాల్గొన్నారు.

IN THE COURT OF PRL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S. No.1082 of 2021

Between:
B.Gajalakshmi ...Plaintiff
And :
S.Srinivasulu Naidu ...Defentdant

SUMMONS TO THE DEFENDANT

To
S.Srinivasulu Naidu,
S/o Late S.Narasimhulu Naidu,
R/at Bandivandlavooru Village,
Madhavaram Post,Yadamari Mandal,
Chittoor District

Sir, Please take notice that the above named plaintiff filed the above suit as against you for recovery of suit amount with future interest and costs basing on the suit promissory note executed by you and the above suit is posted to **20-12-2022** for your apperance before said court. Pleae be present on the said date at about 10-30 A.M either in person or through an advocate and to raise objections if any, failing which the matter will decided as exparte in your absence.

Sd/- Smt M.RAJESWARI,
Advocate for Plaintiff
Place : Chittoor, Date : 01-12-2022

IN THE COURT OF PRL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S. No.1083 of 2021

Between:
B.Nagaraja Naidu ...Plaintiff
And :
S.Srinivasulu Naidu ...Defentdant

SUMMONS TO THE DEFENDANT

To
S.Srinivasulu Naidu,
S/o Late S.Narasimhulu Naidu,
R/at Bandivandlavooru Village,
Madhavaram Post,Yadamari Mandal,
Chittoor District

Sir, Please take notice that the above named plaintiff filed the above suit as against you for recovery of suit amount with future interest and costs basing on the suit promissory note executed by you and the above suit is posted to **16-12-2022** for your apperance before said court. Pleae be present on the said date at about 10-30 A.M either in person or through an advocate and to raise objections if any, failing which the matter will decided as exparte in your absence.

Sd/- Smt M.RAJESWARI,
Advocate for Plaintiff
Place : Chittoor, Date : 01-12-2022